
సాక్షి ఒడిశా

శనివారం । 25 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,96,161
బంగారం	1 గ్రాము 100 మిల్లీ గ్రాములు
వెండి	45 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ముగిసిన శీతాకాల సమావేశాలు

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు నిర్ధారిత సమయం కంటే ముందస్తుగా ముగిసిపోయాయి.

- 10లో



విజి'లెన్స్'

నబరంగ్‌పూర్ జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగా పాయక్‌రాయ్ ఆస్తులపై విజిలెన్స్ దాడులు శుక్రవారం జరిగాయి.

- 10లో

న్యూస్‌రీల్

7,000 గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు లేవు

- మంత్రి తుషారకాంతి బెహరా

భువనేశ్వర్: రాష్ట్రంలో సుమారు 7,000 గ్రామాలకు నేటివరకు మొబైల్ మరియు ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేవని రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ సాంకేతిక సమాచార శాఖ మంత్రి తుషారకాంతి బెహరా శాసనసభలో శుక్రవారం తెలియజేశారు. ఈ విషయాన్ని సభలో రాయ్‌రంగ్‌పూర్ ఎమ్మెల్యే నొబొ చరణ్ మాఝీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి వివరాలను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో సమగ్రంగా 6,799 గ్రామాలకు టెలికాం, ఇంటర్నెట్ సేవలు లేవని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యూఎస్‌ఓఎఫ్ (యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్) కింద మూడు ప్రధాన టెలికాం ఆపరేటర్లు అందించే సేవల కోసం రాష్ట్రంలోని 3,673 టెలికాం, ఇంటర్నెట్ సేవలు లేని ప్రాంతాల్లో మొబైల్ టవర్‌లను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా భూమిని కేటాయించిందని ఆయన చెప్పారు. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మొబైల్ సేవలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో టెలీ కమ్యూనికేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి మరియు నిర్ధారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒడిషా మొబైల్ టవర్స్ మరియు టెలిగ్రాఫ్ లైన్, ఓఎఫ్‌సీ మరియు సంబంధిత టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పాలసీ – 2017ను అమలు చేసిందని వెల్లడించారు.

కుప్పకూలిన హబిష్యాలి

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ మందిరం ప్రాంగణంలో వృద్ధ హబిష్యాలి అకస్మాత్తుగా కుప్పకూలింది. దీంతో హుటాహుటిన స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలు నయాగఢ్ జిల్లాకు చెందిన 73 ఏళ్ల ఫకీర్ ధలువాగా గుర్తించారు. కార్తీక వ్రతం పురస్కరించుకుని శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులను దర్శించుకునేందుకు విచ్చేసిన సందర్భంగా రద్దీ మధ్య తాళలేక కుప్ప కూలింది. ఈ విచారకర సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పవిత్ర కార్తీక మాసంలో హబిష్యాలి వ్రతం ఆచరించేందుకు నయాగఢ్ నుంచి పూరీ వచ్చి స్థానిక నీలాచల్ భక్తి నివాస్‌లో బస చేసింది. ఇంతలో దర్శన సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి జారుకుని వైద్యం అందేలోగా తుది శ్వాస విడవడంతో తోటి హబిష్యాలీలు విచారం వ్యక్తం చేశారు. కార్తీక మాసం చివరి 5 రోజులు అత్యంత పవిత్రమైనవిగా పరిగణిస్తారు. ఈ వ్యవధిని స్థానికులు పంచుకగా పేర్కొంటారు. ఈ రోజుల్లో పూరీ శ్రీజగన్నాథ దేవస్థానం భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంది. మరోవైపు పలు ప్రాంతాల నుంచి హబిష్యాలీ వ్రతం ఆచరణ కోసం 3,000 మందికి పైగా భక్తులు విచ్చేసి పూరీ పట్టణవ్యాప్తంగా పలు మఠాలు, ఇతరేతర వసతి సముదాయాల్లో గత నెల రోజులుగా బస చేసి భక్తిశ్రద్ధలతో కార్తీక వ్రతం సామూహికంగా ఆచరిస్తున్నారు.

బదలాయింపు నిర్ణయంపై పునః సమీక్ష

- టీఏసీ పరిశీలనకు సిఫారసు

భువనేశ్వర్: షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజనులు తమ భూమిని గిరిజనేతరులకు విక్రయించడానికి మరియు తనఖా పెట్టడానికి అనుమతిస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని పునః సమీక్షించాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి నిరంజన్ పూజారి శుక్రవారం ఈ విషయం సభకు తెలియజేశారు. స్థానిక లోక్‌సేవా భవన్‌లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గిరిజనుల భూములు ఇతరుల బదలాయింపు అంశంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవ్వడంతో పరిస్థితి జటిలమైన విషయం తెలిసిందే. మంత్రి మండలి నిర్ణయం పూర్తిగా ఉపసంహరించుకోవాలని విపక్షాలు గట్టిగా పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేల బృందం రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది.

మంత్రి మండలి అత్యవసర సమావేశం

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన అత్యవసరంగా మంత్రి మండలి శుక్రవారం సమావేశమైంది. వివాదస్పద సంస్కరణపై క్షుణ్ణంగా చర్చించి తదుపరి పరిశీలన మరియు స్పష్టత కోసం గిరిజన సలహా మండలికి (టీఏసీ) సిఫారసు చేసేందుకు నిర్ణయించినట్లు మంత్రి నిరంజన పూజారి సభకు వివరించారు. విపక్షాలు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెసు సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత తలెత్తి సభలో గత రెండు రోజులుగా గందరగోళ పరిస్థితి తాండవిస్తోంది. దీంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



పొలంలో వర్షానికి తడుస్తున్న వరి కుప్పలు



కోత కోసిన వరిపంట

చివరి గండం

- రెండు రోజులుగా ముసురు
- భయపెడుతున్న అకాల వర్షాలు
- పొలాల్లోనే కోతకోసిన పంట
- ఆందోళనలో అన్నదాత

రాయగడ: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు కలత చెందుతున్నారు. ఇప్పటికే వరి పంటను కోసి కుప్పలను సిద్ధం చేయడంతో వర్షాల కారణంగా తడిసిపోతుందేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు సమితి పితామహల్ పంచాయతీలోని బెహరగుడలో ఈ ఏడాది సుమారు రెండు వందల ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. వారం రోజుల క్రితమే కోతలు పూర్తవ్వడంతో పొలాల్లోనే పంటను ఉంచారు. మరికొందరు కుప్పలుగా వేసుకున్నారు. అయితే అనుకోకుండా ముసురు వేయడంతో పంట తడిస్తే నష్టాలబారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో టార్పలిన్లు కప్పి పంటను కాపాడుకోవడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 40,749 హెక్టార్ల విస్తీర్ణంలో ఖరీఫ్ పంటగా వరి సాగయ్యింది. డిసెంబర్ 26వ తేదీ నుంచి జిల్లా యంత్రాంగం మండీలను ఏర్పాటు చేసి, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దీంతో అప్పటివరకు పంటను కాపాడుకోవాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది.



వరి కుప్పలపై చాలీచాలని టార్పలిన్లు కప్పిన దృశ్యం

కుప్పలుగా వేశాను



ఈ ఏడాది ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో వరిపంట సాగు చేశాను. పంట పుష్కలంగా పండడంతో మూడు రోజుల క్రితం వరికోసి కుప్పలుగా ఉంచాను. మండీలు ప్రారంభమయ్యేలోగా ధాన్యాన్ని సిద్ధంచేసి విక్రయించాలనుకున్నాను. కానీ ఇప్పుడు వర్షం కారణంగా కుప్పలుగా ఉంచిన వరి తడిసిపోతోంది. ఇలా మరికొద్ది రోజులు వర్షాలు కురుస్తే చేతికి అందిన పంట పూర్తిగా నాశనం అవుతుంది. ధాన్యం తడిసి ముద్దయితే నష్టాల ఊబిలో చిక్కుకుంటాను,

– గుర్లు ఉర్లాక, రైతు, బెహరాగుడ

టార్పలిన్లు కప్పి ఉంచాం



గత రెండు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. మా దగ్గర ఉన్నటువంటి టార్పలిన్లుతో వరి కుప్పలను కప్పి ఉంచాం. తడవకుండా జాగ్రత్తలు చేస్తున్నప్పటికీ చాలీచాలని టార్పలిన్లు ఉండడంతో పంట కొంతవరకు తడిచిపోతోంది. ఇలా మరి కొద్దిరోజులు వర్షాలు కురిస్తే మొత్తం పంట పాడైపోతుంది. జిల్లా యంత్రాంగం ఆదుకోవాలి.

– అప్పారావు బిడిక, రైతు, బెహరాగుడ

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను ఈ ఏడాది చిన్నరకం ధాన్యం పది ఎకరాల్లో సాగు చేశాను. పంట కోతకు రావడంతో కోసి పొలంలోనే ఉంచాను. అనుకోకుండా ఇలా ఏకదాటిగా వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– మాధవరావు బిడిక, రైతు, బెహరాగుడ

కష్టాలు తప్పడం లేదు



వ్యవసాయమే ఆధారంగా భావించి ప్రతీ ఏడాది వరి సాగు చేస్తున్నాను. పంట చేతికొచ్చి అమ్మకాలు పూర్తయ్యే వరకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం పంటను కోసి కుప్పలుగా వేసి నూర్పుకి సిద్ధంగా ఉంచాము. కానీ అకాల వర్షాలు కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇలాగే వర్షాలు కొనసాగితే ఈసారి కూడా నష్టాలు తప్పేలా లేవు.

– రమేష్ తాడింగి, రైతు, పితామహల్

ఆందోళన వద్దు



అకాల వర్షాల కారణంగా పంటలు పాడైపోతాయని, నష్టాల ఊబిలో కూరుకుపోతామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల కారణంగా నష్టాలు చవిచూసిన వెంటనే ప్రభుత్వం వారిని ఆదుకునేవిధంగా చర్యలు తీసుకుంటుంది. ఫసల్ బీమా యోజన పథకం కింద నమోదు చేసుకున్న ప్రతీ రైతు టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలి. సమాచారం అందుకున్న సమితి తహసీల్దార్ లేదా రెవెన్యూ విభాగం అధికారులతో కూడిన ఒక కమిటీ తక్షణమే ఆయా ప్రాంతాలకు వెళ్లి పంట నష్టం అంచనా వేసి రైతులను బీమా రూపంలో ఆదుకుంటుంది. ఈ వర్షాలతో కోసి ఉంచిన వరి పంటలు పాడైపోయే అవకాశం ఉంది గానీ, ఇంకా కోతకు రాని పంటలకు మేలు జరుగుతుంది.

– మనోజ్ కుమార్ ప్రధాన్, జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి

స్కూల్ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- బీజేపీ, కాంగ్రెస్ నాయకుల డిమాండ్

రాయగడ: స్థానిక భారిజోల వద్దనున్న శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర దర్యాప్తు చేయాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు.. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, సీనియర్ నాయకుడు అప్పలస్వామి కద్రక, డీసీసీ సాధారణ కార్యదర్శి పార్థ వర్ధన్, జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు అస్లామ్ ఖాన్, బీజేపీ కౌన్సిలర్ మంజులా మినియాక తదితరులు పోలీసుస్టేషన్‌కు చేరుకొని ఐఐసీ కమలాకాంత్ కుహారోతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐఐసీ మాట్లాడుతూ.. తమకు అందిన సమాచారం మేరకు దర్యాప్తు ప్రారంభించామన్నారు. అనంతరం పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా పండ విలేకరులతో మాట్లాడుతూ.. రాయగడలో ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థులపై మానసిక ఒత్తిడి ఎక్కువవ్వడంతో ఇటువంటి ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. కేవలం వ్యాపారపరంగానే ఈ స్కూల్ వ్యవహరిస్తోందని, ఇంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురైతే కనీసం స్కూల్‌లో ప్రథమ చికిత్సకు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. స్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ స్కూల్‌ను నిర్వహిస్తుండడం సరికాదన్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేయాలని కోరారు. సీబీఎస్‌ఈ సిలబస్‌కు సంబంధించి స్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేవని, దీనిబట్టి స్కూల్ నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కాగా స్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరిగిపోతోందని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ ఎం.రజనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

బీజేడీ గూటికి సుకాంత అధికారి

- మరోసారి పార్టీ మారిన సంగీత కళాకారుడు

జయపురం: ప్రముఖ సంగీత కళాకారుడు సుకాంత అధికారి మరోసారి పార్టీ మారారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఆయన కొంతకాలం కిందట తిరిగి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కాగా మరలా ఇప్పుడు కమ్యూనిస్టు పార్టీని వీడి బీజేడీలో చేరారు. సుకాంత అధికారి పలు కార్మిక సంఘాల అధ్యక్షుడిగా ఉంటున్నారు. స్థానిక ఒక కల్యాణ మండపంలో జరిగిన బీజేడీ కార్యక్రమంలో జిల్లా బీజేడీ అధ్యక్షుడు ఝిన్నా హికాక, మాజీ మంత్రి రబినారాయణ నందో, మహిళా నాయకురాలు డాక్టర్ ఇందిర నందోల సమక్షంలో బీజేడీలో చేరారు. ఈ సందర్భంగా సుకాంత అధికారి మాట్లాడుతూ స్థానిక పారాబెడలోని సంగీత కళాశాల అభివృద్ధికి మాజీ మంత్రి రబినారాయణ నందో తనకు హామీ ఇచ్చారన్నారు. అంతేకాకుండా సంగీత కళాశాల ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తున్నారని, అందుకు తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. సంగీత కళాశాల విషయంలో స్థానిక ఎమ్మెల్యేకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడై బీజేడీలో చేరానని, పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వహిస్తానని తెలియజేశారు.



సుకాంత అధికారిని ఆహ్వానిస్తున్న బీజేడీ నాయకులు

నాటుసారా బట్టీలపై దాడులు



సున్నారిబడిలో నాటుసారా బట్టీపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బరంపురం: బరంపురం పోలీసు జిల్లా పరిధిలో అక్రమంగా నడుస్తున్న రెండు నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టి 3,600 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ శుక్రవారం తెలిపి వివరాల మేరకు.. జరడా పోలీసుస్టేషన్ పరిధి సున్నారిబడి, సాసనొపదర్, బొడజొలా గ్రామాల శివారులో నాటుసారా తయారు చేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అలాగే కె.నువాగం పోలీసుస్టేషన్ పరిధి చికిటి పెంట శివారు ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీపై సైతం దాడి చేశారు. ఈ దాడుల్లో సుమారు 3,600 లీటర్ల నాటుసారా ధ్వంసంచేసి, సామగ్రీ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.



నిల్వ ఉంచిన నాటుసారా ఊట



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఆందోళన

పర్లాకిమిడి: వర్షాభావం వలన గజపతి జిల్లాలో ఏడు సమితి కేంద్రాల్లో కరువు తాండవిస్తోందని, వ్యవసాయాధికారులు సర్వేచేసి కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎంఎల్(లిబరేషన్) రాష్ట్ర కమిటీ సభ్యుడు తిరుపతి గొమాంగో డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక హైస్కూల్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు గిరిజనులు డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలతో నిరసన ర్యాలీ శుక్రవారం చేపట్టారు. అనంతరం తిరుపతి గొమాంగో మాట్లాడుతూ.. వర్షాలు లేకపోవడం వలన ఖరీఫ్ వరిపంట పోగొట్టుకున్న గిరిజనులకు రూ.50 వేల పంటనష్టం అందించాలని, మొక్కజొన్న కిలో రూ.100లకు కొనుగోలు చేయాలని కోరారు. వీటితో పాటు గిరిజనుల 16 డిమాండ్లు నెరవేర్చాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవిస్తూ రాసిన వినతిని డిప్యూటీ కలెక్టర్‌కు అందజేశారు. ఆందోళనలో సీపీఎంఎల్(లిబరేషన్) జిల్లా కార్యదర్శి శ్రీనివాస బెహరా, నరసింగ మండల్, మాథ్యూ రైయితో, బృందావన్ బిడికా, జస్మిన్ రైయితో తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి హైస్కూల్ జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీలు



సాంప్రదాయ వాయిద్యాలతో ఆదివాసీల నిరసన



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఓస్వాస్ అభివృద్ధికి ఆమోదం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ప్రధానంగా ఎలక్ట్రానిక్స్ మరియు సాంకేతిక సమాచార శాఖ, వ్యవసాయం మరియు రైతుల సాధికారత శాఖల నుంచి రెండు ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలోని అత్యుత్తమ డిజిటల్ వర్క్ ఫ్లో సిస్టమ్‌లలో ఒకటిగా పరిగణించబడే ఒడిశా స్టేట్ వర్క్ ఫ్లో ఆటోమేషన్ సిస్టమ్ (ఓస్వాస్)ను అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం తెలిపారు. ప్రతిపాదిత మెరుగుదల చొరవ 5టీ ఫ్రేమ్ వర్క్ కింద పరిపాలన సామర్థ్య స్థాయిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తుందని మరియు పౌర స్నేహపూర్వక పారదర్శక వ్యవస్థను నిర్ధారిస్తుందని పేర్కొన్నారు. అలాగే 1962 సంవత్సరంలో స్థాపించబడిన ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ (ఓయూఏటీ)లో 2023–24 నుంచి 2027–28 వరకు ఐదేళ్ల కాలానికి అత్యవసర మరమ్మతులు, పునరుద్ధరణ మరియు మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం కోసం రూ.491.41 కోట్ల వ్యయ మంజూరుకు అంగీకరించారు.

కారులో ఆకస్మికంగా మంటలు

- ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికులు



దగ్ధమవుతున్న కారు

జయపురం: రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా కాలిపోయిన ఘటన కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితిలో చోటుచేసుకుంది. గురువారం జరిగిన ఈ అవాంఛనీయ సంఘటనలో కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. నారాయణపట్నకు చెందిన నారంశెట్టి ప్రసతి కుమార్, అతడి మిత్రుడు కలిసి కారులో బొరిగి గ్రామం వెళ్తుండగా ఘాట్ రోడ్డులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు గమనించిన కారులో ఉన్నవారు వెంటనే కారు దిగి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వెంటనే అగ్నిమాపక విభాగానికి తెలియజేశారు. అయితే అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు.

26న రచయితల సంఘం వార్షికోత్సవం

రాయగడ: స్థానిక రాజీభవన్ సమావేశ మందిరంలో ఈనెల 26వ తేదీన రాయగడ రచయితల సంఘం పదో వార్షికోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళంకు చెందిన ఈ వేమన ఎస్.మహ్మద్ రఫీ, ముఖ్య వక్తగా సాలూరుకు చెందిన ప్రముఖ విమర్శకులు కీలవర్తి దాలినాయుడు, గౌరవ అతిథులుగా రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, పుర ప్రముఖులు జీడీ చౌదరిలు హాజరుకానున్నట్లు సంఘం అధ్యక్షుడు టీవీఎస్‌ఆర్ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ముగిసిన కాళీ పూజలు



నిమజ్జనానికి తరలివెళ్తున్న కాళీమాత విగ్రహం

రాయగడ: స్థానిక బ్లాక్ కాలనీ సమీపంలోని కాళీ మందిరంలో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి జరుగుతున్న కాళీ పూజలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి జంఝావతి నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ పరిశీలన

మెళియాపుట్టి: ఉద్దానం ప్రజల కోసం ప్రభుత్వం నిర్మించిన వైఎస్సార్‌సుజల ధార ప్రాజెక్టు గురించి టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన శుక్రవారం ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. నీరు శుద్ధి చేసే పలు విభాగాల గురించి సిబ్బందితో మాట్లాడారు. అదేవిధంగా పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు సైతం ఈ ప్రాజెక్ట్ ద్వారా తాగునీరు అందుతుందని అధికారులు తెలియజేశారు.

ముగిసిన శీతాకాల సమావేశాలు

- 26 రోజుల ముందే వాయిదా
- కార్యకలాపాలు ముగిశాయి: అధికార పక్షం

భువనేశ్వర్:

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు నిర్ధారిత సమయం కంటే ముందస్తుగా ముగిసిపోయాయి. ఈ సమావేశాలు పుస్కరించుకుని జారీ చేసిన వ్యవధి కంటే 26 రోజుల ముందుగానే సభా కార్యక్రమాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈనెల 21వ తేదీ నుంచి శీతాకాల సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ముందుగా డిసెంబర్ 30వ తేదీ వరకు నిరవధికంగా కొనసాగుతాయని కార్యక్రమం ఖరారు చేశారు. అయితే నామమాత్రంగా 4 రోజులు మాత్రమే సమావేశాలు కొనసాగాయి. ఇంతటితో అధికారికంగా ఎలాంటి వ్యవహారాలు లేనట్లు పేర్కొని స్పీకర్ ప్రమీలా మల్లిక్ సభను నిరవధికంగా వాయిదా (సైన్ – ఎ – డై) పడినట్లు ప్రకటించారు. దీనికి సంబంధించి అధికార పక్షం బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రశాంత ముదులి తీర్మానం సభలో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అధికార పక్షం సభ్యులు శశి భూషణ్ బెహరా మరియు భూపిందర్ సింఘ్ మద్దతు ప్రకటించారు. దీంతో స్పీకర్ ప్రమీలా మల్లిక్ సభను నిరవధికంగా వాయిదా వేశారు.

ప్రతిపక్షాల వాకౌట్



సమావేశాల అర్థాంతర ముగింపుపై నిరసన తెలుపుతున్న విపక్ష సభ్యులు

ఈ తీర్మానానికి నిరసనగా ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 30 రోజుల పాటు సభా కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉండగా, 26 రోజులు ముందుగా ముగించడంపై విపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. మొక్కుబడిగా 4 రోజులు మాత్రమే జరిగిన శీతాకాల సమావేశాల్లో తొలి రోజు దివంగతులకు శ్రద్ధాంజలి ఘటించారు. తదుపరి 2 రోజులు వరుసగా గిరిజనుల భూ బదలాయింపు అంశంపై అధికార, విపక్షాల వాదోపవాదాలతో సభా కార్యక్రమాలు గందరగోళంగా కొనసాగాయి. నాలుగో రోజున ఈ సంస్కరణకు సంబంధించి మంత్రి మండలి పునరాలోచన ప్రతిపాదనని సభకు తెలియజేసి, తదుపరి పనిదినాల్లో కార్యకలాపాలు నిరవధికంగా వాయిదా పడినట్లు ప్రకటించడంతో సుదీర్ఘ 30 రోజుల శీతాకాలం సమావేశాలకు సైన్ – ఏ – డై తెర దించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత్ ముదులి మాట్లాడుతూ అన్ని అధికారిక బిల్లులు, ప్రైవేట్ బిల్లులపై చర్చ పూర్తయ్యిందన్నారు. అంతకుమించి చర్చించాల్సింది ఏమీ లేదని పేర్కొన్నారు. అంతేకాదు సభ్యులు తమ తమ ప్రాంతాల్లో బిజీగా ఉన్నందున శాసనసభ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినట్లు వివరించారు.

విజి'లెన్స్'

కొరాపుట్/జయపూర్: నబరంగ్‌పూర్ జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగా పాయక్‌రాయ్ ఆస్తులపై విజిలెన్స్ దాడులు జరిగాయి. శుక్రవారం ఉదయం ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 6 చోట్ల మెరుపుదాడులు నిర్వహించారు. నబరంగ్‌పూర్‌లోని అతని కార్యాలయ చంబర్‌లో అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. జయపూర్‌లోని ఫైర్ స్టేషన్ ప్రాంతంలోని నివాస భవనంలో, జయపూర్‌లోని గ్లోకల్ ఆస్పత్రి సమీపంలోని నిర్మాణ భవనం, కొత్త వీధి మెదటి లైన్‌లోని భవనం, హన్నాగుడలోని పార్కింగ్ షెడ్ వద్ద, నబరంగ్‌పూర్‌లోని సదాశివ లైన్ అద్దె భవనంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు డీఎస్పీలు, ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు ఏఎస్‌ఐలు పాల్గొన్నారు. శుక్రవారం



గంగా పాయక్‌రాయ్‌ను ప్రశ్నిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాత్రియ్యేసరికి అతనికి జయపూర్‌లో రెండు బహుళ అంతస్తుల భవనాలు, 5 ప్లాట్లు, రూ.లక్ష నగదు, 2 నాలుగు చక్రాల వాహనాలు, అనేక బినామీ ఆస్తులు బయటపడ్డాయి. ఒక ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థకి రూ.16 లక్షల అడ్వాన్స్ చెల్లింపు, మరో 5 ప్లాట్ల కొనుగోలు పత్రాలు, బ్యాంక్ డిపాజిట్లు లభించినట్లు సమాచారం. ఈ దాడులు ఇంకా కొనసాగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

వాటర్ ప్యూరిఫైయర్ కేంద్రాలు ప్రారంభం

రాయగడ: పట్టణంలోని మహిళా కళాశాల, యుజీఎంఐటీ, డీఐసీ, రాయగడ కళాశాల కూడళ్లలో చిల్లింగ్ వాటర్ ప్యూరిఫైయర్ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. రాజ్యసభ ఎంపీగా పనిచేసిన సమయంలో నెక్కంటి తన ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించారు. అప్పుడు మంజూరైన నిధులతో వీటిని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేడీ కార్యకర్తలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వాటర్ ప్యూరిఫైయర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నెక్కంటి భాస్కరరావు

4,228 కిలోల గంజాయి ధ్వంసం

రాయగడ: జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 4,228 కిలోల గంజాయిని జిల్లా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు కలసి కొరాపుట్ జిల్లా నాల్కో కర్మాగారంలో శుక్రవారం ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహర, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చంద్రపూర్ సమితి గొడినెంగి ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయిని పోలీసులు ధ్వంసం చేశారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న 2 వేల గంజాయి మొక్కలను అధికారులు ఆకస్మిక దాడులను నిర్వహించి తగలబెట్టారు.



గంజాయిని ధ్వంసం చేస్తున్న దృశ్యం

చైతన్యంతోనే మధుమేహం కట్టడి

బరంపురం: సమాజంలో చైతన్యంతోనే మధుమేహం వ్యాధిని కట్టడి చేయవచ్చని మధుమేహ వ్యాధి మరియు ఎండోస్కోప్ ఎండీ సునీల్ కోటా అన్నారు. స్థానిక రోలాండ్ ఫార్మాసూటికల్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహం వ్యాధి మరియు ఫార్మాసూటికల్ వారోత్సవాలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఎండీ సునీల్ కోటా మాట్లాడుతూ సరైన అవగాహన లేకపోవడం వలనే రోజురోజుకీ మధుమేహం వ్యాధిగ్రస్తుల గణాంకాలు పెరుగుతున్నాయన్నారు. మధుమేహంతో ప్రతీ 10 సెకండ్‌కు ఇద్దరు మృతి చెందుతున్నట్లు వెల్లడించారు. 50 ఏళ్లు దాటినవారు ప్రతీ మూడు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పీసీ సాహు, డా.ప్రవీణ్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.సునీల్ కోటా తదితరులు

బోటింగ్ సదుపాయం ఏర్పాటు



బోటింగ్ చేస్తున్న కలెక్టర్ విశాల్ తదితరులు



బోటింగ్ ప్రదేశాలను పర్యవేక్షిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా ప్రకృతి అందాలు చూడడానికి వచ్చే పర్యాటకుల కోసం జలాశయంలో నౌక విహార్(గురుప్రియ బోటింగ్ కాంప్లెక్స్)ను కలెక్టర్ విశాల్ సింగ్ శుక్రవారం ప్రారంభించారు. పర్యాటకులు జలాశయంలో ప్రకృతి అందాలు చూస్తూ ఆనందించడం కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, చిత్రకొండ రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ శక్తి కేఫ్ ప్రారంభం



కేఫ్ ప్రారంభిస్తున్న మంత్రి సరక, పక్కనే నెక్కంటి, ఉలక తదితరులు

రాయగడ: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద మిషన్ శక్తి కేఫ్‌ను రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.62 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కేఫ్ నిర్వహణ బాధ్యతలను స్థానిక గౌతంనగర్‌కు చెందిన గోదాదేవి మహిళా స్వయం సహాయక బృందం చేపట్టనుంది. ఈ సందర్భంగా మంత్రి సరక మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకం తీసుకొచ్చిందన్నారు. దీంతో మహిళలు ఎన్నో మంచి ఫలితాలను అందుకుంటున్నారని తెలియజేశారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. ప్రతీ సమితి కేంద్రంలో ఇటువంటి కేఫ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. కార్యక్రమంలో కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరావు, మాజీమంత్రి లాల్ బిహారి హిమిరిక, ఎస్డీసీ చైర్మన్ అనసూయా మాఝి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి తదితరులు పాల్గొన్నారు.



మిషన్ శక్తి కేఫ్

ఇద్దరు ఒడిశా గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

- మరొకరి పరారీ
- పది కిలోల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్‌ఐ రవీంద్ర, పోలీసులు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు ఒడిశా గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఒకరు పరారయ్యాడు. గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన బైకు, రూ.10 వేలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రవీంద్ర వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు లబ్బూరు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు తనిఖీలు చేస్తుండగా, బుంగాపుట్టు నుంచి ఒడిశా రాష్ట్రం వైపు వస్తున్న బైకు వదిలేసి నిందితులు పారిపోతుండగా వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. మరొక నిందితుడు తప్పించుకున్నాడు. వారి వద్ద బ్యాగు తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. అరెస్ట్ చేసి, గంజాయిని, బైకును సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన పది కిలోల గంజాయి విలువ రూ.10 వేలు ఉంటుందని నిర్ధారించారు. పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కొరాపుట్టు జిల్లా పొట్టంగి గ్రామ పంచాయతీకి చెందిన హిమాన్షు శేఖర్, ఇదే జిల్లా బిల్లాపుట్టు పంచాయతీ గొడిపుట్టు గ్రామానికి చెందిన మఠం సుశాంత్‌గా గుర్తించారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి చెందిన దానేష్ పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఏఎస్‌ఐ తిరుపతి, పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

ముగిసిన బీజేడీ శిక్షణ శిబిరం



కార్యకర్తల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మాజీమంత్రి నందో



శిక్షణ శిబిరంలో పాల్గొన్న బీజేడీ శ్రేణులు

జయపురం: పట్టణంలోని ఒక కల్యాణ మండపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బీజేడీ పార్టీ శ్రేణుల శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. నియోజకవర్గ పరిధిలోని జయపురం సమితి, బొరిగుమ సమితి, జయపురం మున్సిపాలిటీలోని 5 కొరాపుట్ జిల్లా పరిషత్ జోన్ల నుంచి, మున్సిపాలిటీలోని 28 వార్డుల నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు శిబిరంలో పాల్గొన్నారు. భువనేశ్వర్ శంఖ భవనం నుంచి వచ్చిన ఇద్దరు శిక్షకులు లోర మహాపాత్రో, అపూర్వలు పార్టీ శ్రేణులకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పథకాలు గురించి వివరించారు. మాజీ మంత్రి రబినారాయణ నందో మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ఇప్పటినుంచే ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా బీజేడీ అధ్యక్షుడు ఝిన్నా హికాక, మహిళా నాయకులు కౌశల్య హికాక, డాక్టర్ ఇందిరా నందో, మాజీ కౌన్సిలర్లు ఎ.శ్రీనివాసరావు, ప్రమోద్ మఝి, దుర్గా మిశ్ర, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, శివ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాయగడ: జిల్లా కేంద్రానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లోయిస్ (ఇంఫా) సంస్థకు చెందిన వంశీధర్ ఇలాపండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. గోపబంధు నగర్‌లోని ఇంఫా క్లబ్‌లో జరిగిన శిబిరాన్ని ఇంఫా కర్మాగారం యూనిట్ హెడ్ అశీష్ కుమార్ రాయ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కర్మాగారంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది వారి కుటుంబాలతో సహా యువకులు కూడా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. జిల్లా కేంద్రాస్పత్రికి చెందిన డాక్టర్ హర్షవర్ధన్ పర్యవేక్షణలో శిబిరం జరిగింది.



రక్తదానంలో పాల్గొన్న యువత

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కంచిలి: మకరాంపురం సంత కూడలి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాడుపూడి గ్రామానికి చెందిన మహిళ రాయల దేవకి (48) దుర్మరణం చెందారు. ఆమె కంచిలిలో రైల్వేక్వార్టర్స్‌లో నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ చిట్టికం దుర్గారావుతో కలిసి బైక్‌పై వెళుతుండగా.. అదే మార్గంలో తమ ముందు బైక్‌పై వెళుతున్న బిన్నళకొత్తూరు గ్రామానికి చెందిన బుద్దాల వల్లభరావు హఠాత్తుగా మకరాంపురం సంత కూడలి వద్ద అవతలి రోడ్డువైపు ఎటువంటి సిగ్నల్స్ ఇవ్వకుండా తిప్పేశాడు. దీంతో రెండు బైకులు ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో వెనుక బైక్‌లో కూర్చున్న దేవకి రోడ్డు మీద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారకుడైన వల్లభరావుకు, మృతురాలు కూర్చున్న వాహనాన్ని నడుపుతున్న దుర్గారావులకు స్వల్ప గాయాలయ్యాయి. దేవకి భర్త మృతి చెందగా, ఆమెకి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రకాశరావు ఆటో నడుపుతూ జీవనం పొందుతున్నాడు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిరుధాన్యం.. సాగుకు ప్రాధాన్యం

- జిల్లాలో 20వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ
- యాభై శాతం రాయితీపై ఇతర రైతులకు పంపిణీ

కొత్తూరు: చిరు ధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జనాల్లో చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన పెరగడంతో వీటికి మంచి గిరాకీ లభిస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు ఈ సాగు వైపు మొగ్గు చూపేలా ప్రభుత్వం విత్తనాల కొనుగోలులో రాయితీలు ఇస్తోంది. రాగి, కొర్రలు వంటి విత్తనాలను సర్కారే రైతులకు పంపిణీ చేస్తోంది. ప్రాసెసింగ్ యూనిట్లను కూడా అందజేస్తోంది. జిల్లాలోని ముప్పై మండలాల్లో నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో రబీలో 20 వేల ఎకరాల్లో రాగితోపాటు కొర్రలు, ఇతర చిరు ధాన్యాలు సాగు చేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాయితీపై రాగి విత్తనాలు సుమారు 400 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.



కొత్తూరు మండలం గిట్టిపల్లి ప్రాంతంలో సాగు చేస్తున్న రాగి పంటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతుకు వివరిస్తున్న ఎంటీఎస్. సూర్యనారాయణ

ఖరీఫ్‌లో ఇలా..

జిల్లాలో ఖరీఫ్‌లో దాదాపు ఐదు వేల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేశారు. 200 క్వింటాళ్ల విత్తనాలు రాయితీపై అందించారు. జిల్లాలో రాగి, కొర్రలు పంటల సాగుకు అనువుగా ఉన్నందున రాగి సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడాది రబీలో సుమారు 10 వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది రబీలో 20 వేల ఎకరాల్లో సాగుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో రాగి పంట ఎక్కువగా సాగు చేయడంతో రాగి క్వింటా రూ.3850లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. జిల్లాలో రాగి పండిన పంట మొత్తాన్ని పౌర సరఫరా శాఖ కొనుగోలు చేసి తిరిగి అంగన్‌వాడీలు, మధ్యాహ్నం భోజనం పథకం, రెసిడెన్సియల్ పాఠశాలలకు పంపిణీ చేస్తుంది.

రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లు



జిల్లాలో రాగి, జొన్నలు వంటి పంటల సాగు పెంచాలన్న ఆలోచనతో మహిళా సంఘాలకు, రైతు ఉత్పత్తి సంఘాలకు రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నాం. రబీలో సాగునీటికి అవకాశం ఉన్న చోట 20 వేలు ఎకరాల్లో రాగి, కొర్రలు సాగు చేసేందుకు నిర్ణయించాం. రాయితీపై 400 క్వింటాళ్ల రాగి విత్తనాలు పంపిణీ చేస్తాం.

– శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ

అవగాహన కల్పిస్తున్నాం



చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. పంట గిట్టుబాటు అయ్యేలా యాజమాన్య పద్ధతులపై తర్ఫీదు ఇస్తున్నాం. అందుకే రైతులు సాగుచేస్తే గిట్టుబాటు అవుతుంది. కొండ ప్రాంతాల్లో సాగయ్యే పంటలు నేడు మైదాన ప్రాంతాల్లో సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.శ్రీనివాసరావు ఏఓ, కొత్తూరు మండలం

రాగి పంట గిట్టుబాటవుతోంది..



ప్రభుత్వం 90 శాతంపై రాగి విత్తనాలు పంపిణీ చేశారు. అంతర పంటలో రాగి పంట సాగు చేశాను. పంట బాగా పండింది. పంటకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. దీంతో గిట్టుబాటవుతోంది. పంట సాగుకు వ్యవసాయ సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు.

– ఊయక చిన్నమ్మి గిరిజన మహిళ రైతు శోభనాపురం గిరిజన కాలనీ

క్లుప్తంగా

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పెదవేమలి విద్యార్థి


లోకేష్

గంట్యాడ: మండలంలోని పెదవేమలి హైస్కూల్ విద్యార్థి రంధి లోకేష్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రదర్శన కనబరచడంతో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. డిసెంబర్ 3 నుంచి 7వతేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడు.

ఖోఖోలో సిరిపురం విద్యార్థిని ప్రతిభ


సంతకవిటి: యోచనను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని వై.యోచన ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈ నెల 19 నుంచి 21 వరకు చిత్తూరు జిల్లా బంగారు పాలెంలో జరిగిన అండర్ 14 విభాగంలో శ్రీకాకుళం జిల్లా తరఫున ఖోఖో పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైస్కూల్‌లో అభినందన సభ ఏర్పాటుచేసి విద్యార్థినితో పాటు, శిక్షణ ఇచ్చిన పీడీ బుజ్జి మాస్టారును ప్రశంసించి సత్కరించారు.

రాష్ట్రస్థాయిలో తైక్వాండో క్రీడాకారుల సత్తా


క్రీడాకారులతో కోచ్, తైక్వాండో క్లబ్ సభ్యులు

బొబ్బిలి: ఈనెల 18 నుంచి రెండు రోజుల పాటు తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల్లో జి.చరిత, షణ్ముఖప్రియ, ఆదిత్య, రజత పతకాలు సాధించారు. అలాగే బి.గౌతమి,డి జాహ్నవి, శివరామకృష్ణ, కాంస్య పతకాలు సాధించారు. వారిని కోచ్ బంకురు ప్రసాద్, క్లబ్ సభ్యులు సబ్బాన శ్రీనివాసరావు, ఆనంద్‌లు అభినందించారు.

50 శాలలు దగ్ధం

• నవరవిల్లి సంతలో అగ్నిప్రమాదం


కాలిపోయిన తాటాకు శాలలు

భోగాపురం: మండలంలోని నవరవిల్లి సంతలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 50 తాటాకు శాలలు పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ప్రతి సోమవారం సంతలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే శుక్రవారం సంతలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం ఎలా సంభవించిందో తెలియరాలేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వీఆర్వో రామునాయుడు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

సాలూరు: పట్టణంలోని బంగారమ్మకాలనీకి చెందిన వివాహిత సాంపి సన్యాసమ్మ హత్య కేసులో ఆమె భర్త లక్ష్మణరావుకు విజయనగరం అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్‌జడ్జి కోర్టు కమ్ మహిళా కోర్టు జీవిత ఖైదు విధించినట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, 2021 ఏప్రిల్‌లో సన్యాసమ్మను ఆమె భర్త లక్ష్మణరావు హత్యచేసినట్లు కేసు నమోదైందని చెప్పారు. ఈ కేసులో వాదనలు విన్న తరువాత లక్ష్మణరావును ముద్దాయిగా నిర్ధారించి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా కోర్టు విధించిందని తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

సాలూరు: పట్టణానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లి ఈ నెల 16న ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశామని చెప్పారు. దర్యాప్తులో భాగంగా ఓ యువకుడిపై బాలిక తల్లిదండ్రులు అనుమానం వ్యక్తంచేయగా ఆ దిశగా ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టామని ఆ యువకుడిపై కిడ్నాప్, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. పట్టణ కోర్టులో నిందితుడిని హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు బొబ్బిలి సబ్‌జైలుకు రిమాండ్‌కు తరలించామన్నారు.

యాంటీ బయటిక్స్ వాడకం తగ్గించాలి

• డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: యాంటీ బయటిక్స్ వాడకం ఎక్కువగా ఉన్నందున దీన్ని తగ్గించడానికి యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ ముగింపు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి శరీరంలో కంటికి కనిపించని సూక్ష్మమైన బాక్టీరియా, వైరస్, పారసైట్‌లు, ఫంగస్, వంటి అనేకమైన సూక్ష్మ క్రిములు మనిషి శరీరంలో లోపల బయట తిరుగుతూనే ఉంటాయన్నారు. వీటిని మైక్రోల్స్ అని పిలుస్తారని చెప్పారు. ఈ మైక్రోల్స్ కేవలం మేలు చేయడమే కాదు కొన్ని సందర్భాల్లో కీడు చేస్తుంటాయన్నారు. మనుషులతో పాటు జంతువులకు మొక్కలకు హాని చేస్తుంటాయన్నారు. అందుకే మికరోబియల్ టీకాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసారని తెలిపారు. ఇవి మైక్రోల్స్‌ను అంతం చేయడం లేదా వ్యాప్తిని తగ్గించడం చేస్తుంటాయని అన్నారు. మైక్రోల్స్ ఔషధ నిరోధక శక్తిని కాలానుగుణంగా పెంచుకుంటాయని, అప్పుడు టీకాలకుగాని, ఔషధాలకుగాని లొంగకుండా తయారవుతాయన్నారు. అందువలన సహజ పద్ధతిలో రోగ నిరోధక శక్తి పెంచుకోవడం చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యాంటీ బయటిక్స్ వాడకం మితిమీరుతోందన్నారు. 2000 నుంచి 2015 మధ్య ఇది 65 శాతం పెరిగిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ అరుణశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఐఓ ఆర్.అచ్యుతకుమారి, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డి పోలమాంబకు విశిష్ట పూజలు


వడ్డి పోలమాంబ అమ్మవారు

విజయనగరం టౌన్: శ్రీ శబరి రెల్లికుల సంక్షేమ సంఘం, లంకాపట్నం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్డి పోలమాంబ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ డిసెంబరు 13న బుధవారం సాయంత్రం 6 గంటలకు సంబరం బయలుదేరుతుందని, రాత్రి 12 గంటల తర్వాత గురువారం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అమ్మవారి అనుపు లంకాపట్నం వీధి నుంచి ఊరేగింపుగా బయలుదేరుతుందన్నారు. ఉత్సవంలో అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తోండ్రంగి విద్యార్థులు


చీపురుపల్లి రూరల్: రాష్ట్రస్థాయి ఖోఖోపోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ


గుర్ల: ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గరికవలస హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు


గుర్ల: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో చింతలపేట హెచ్‌ఎం గౌరిదేవి, పీఈటీ లక్ష్మణ్

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.దివ్యశ్రీ, ఎన్.జోషిత, పి.థెరిసా, ఎస్.హారిక, ఒమ్మి సౌమ్య, సీహెచ్.దివాకర్‌లు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు సత్తాచాటారు. ఈనెల 27,28,29 తేదీల్లో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనుండడంతో హెచ్‌ఎం.ఏవీ. రమణరాజు, పీడీ సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది వారిని అభినందించారు.

గరికవలస విద్యార్థులు కూడా..

గుర్ల: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గుర్ల మండలంలోని గరికవలస హైస్కూల్ విద్యార్థులు మండల ధనలక్ష్మి, ఆవాల మణికంఠ ఎంపికయ్యారని పీఈటీ మల్లికార్జున రావు శుక్రవారం తెలిపారు. గుంటూరు జిల్లా నరసరావు పేటలో జరగబోయే ఖోఖో వారు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థులు..

గుర్ల: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు గుర్ల మండలంలోని చింతలపేట హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ కె.లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. నెల్లిమర్లలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలలో అండర్ -14 విభాగంలో మజ్జి యమున, వెంపడాపు భార్గవ్ అండర్-17 విభాగంలో మజ్జి పూజిత, కరిమజ్జి మురళి ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వారు డిసెంబర్ 12న నంద్యాలలో జరగనున్న పోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం గౌరిదేవి అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా నందిగామలోని కిట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, కిమ్స్ రీసెర్చ్ అండ్ ఫౌండేషన్ సహకారంతో హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. రెండు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ విభాగాన్ని (సెల్: 76809 45357, 79950 13422 నంబర్లు) సంప్రదించాలన్నారు.

వరి చేను మాయం


గుర్తుతెలియని వ్యక్తులు వరిచేను దొంగిలించిన పంట పొలాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ రేగులపాడు గ్రామ పరిసరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న సుమారు రెండెకరాల్లోని వరి పంటను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకుని తీసుకెళ్లిపోయారని సాగుదారు పాలక పృథ్వీ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన మండంగి కిశోర్‌కు రేగులపాడు గ్రామ సమీపంలో ఉన్న పొలాలను ఆయన మేనల్లుడు పృథ్వీ కొన్నేళ్ల నుంచి సాగుచేస్తున్నాడు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా వరిపంట వేశాడు. ఈ క్రమంలో ఈనెల9న పొలానికి వెళ్లి చూశానని, మళ్లీ ఈనెల22న వెళ్లి చూసేసరికి పొలంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు లేదని వాపోయాడు. రేగులపాడు గ్రామస్తులను అడగ్గా..వారికి తెలియదంటున్నారని, వేల రూపాయలు మదుపుపెట్టి సాగు చేసిన పంటను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకెళ్లిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నాడు.

గజలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకాలు


అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లోని శ్రీ క్షేత్రమ్‌లో కొలువై ఉన్న శ్రీఅష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో గజలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు ప్రశంసలు


రూరల్ ఎస్సై బి.గణేష్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదించి, ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ అధికారులను జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక అభినందించి, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు.

ప్రశంసలు పొందిన పోలీస్ అధికారులు వీరే..

వన్‌టౌన్‌లో పెండింగ్ కేసుల్లో నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌ను ఎగ్జిక్యూట్ చేసిన వన్‌టౌన్ ఎస్సై ఆర్.గోపాలరావు, జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను డిస్పోజ్ అయ్యేలా పనిచేసిన వన్‌టౌన్ కానిస్టేబుల్ బి.మోహనరావు, రూరల్ పరిధిలో చోరీ కేసును ఛేదించిన రూరల్ ఎస్సై బి.గణేష్, కానిస్టేబుల్స్ బి.గౌరీశంకర్, బి.రామకృష్ణ, కె.రామమోహన్, ఆస్పత్రుల్లో పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్స్‌ను సకాలంలో తీసుకువచ్చిన డెంకాడ కానిస్టేబుల్ జి.రామరాజులను ఎస్పీ అభినందించారు. అలాగే పోక్సో కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సాక్షులను కోర్టులో హాజరుపర్చిన బొబ్బిలి హెచ్‌సీ సీహెచ్.స్వామినాయుడు, దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసిన రామభద్రపురం హెచ్‌సీ వీఎల్‌వీ.నారాయణ, దిశ యాప్‌ను ఎక్కువ డౌన్‌లోడింగ్, రిజిస్ట్రేషన్ చేయించి, అవగాహన కార్యక్రమాలు చేపట్టిన బాడంగి మహిళా కానిస్టేబల్ బి.తులసి, పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా ట్రాఫిక్ రెగ్యులేషన్ విధుల్లో పనిచేసిన ట్రాఫిక్ ఎస్సైలు వి.లోవరాజు, కేవీవీ ప్రసాద్, హెచ్‌సీ ఏవీ రమణ, కానిస్టేబుల్స్ ఎస్.సింహాచలం, వై.అప్పారావు, వై.శంకరరావు, ఏటీఎం చోరీ కేసులో నిందితుడ్ని పట్టుకున్న సీసీఎస్ ఎస్సై బి.సాగర్ బాబు, ఏఆర్ కానిస్టేబుల్ పి.కాళిదాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల్లో ముందస్తు సమాచారం సేకరణలో సమర్థవంతంగా పనిచేసిన స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ షేక్ బి.జానీ ఏఆర్‌లో పీఎస్‌ఓ భాగంలో పనిచేస్తూ, ఇటీవల నిర్వహించిన ఫైరింగ్ టెస్టుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన హెచ్‌సీ వి.శ్రీనివాసరావు, కేవీ.రమణ, డి.రాము, బి.శంకర్, బీపీ రాజులను ఎస్పీ అభినందించి, జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అందజేశారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు బాడంగి విద్యార్థి

బాడంగి: స్థానిక హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మామిడిశ్రీను జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ, కోచ్ జి.బంగారునాయుడు చెప్పారు. ఈ మేరకు స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 19, 20,21వతేదీల లోనంద్యాల జిల్లాలోని మిడుతూరులో జరిగిన అండర్ 14 స్కూల్‌గేమ్స్‌లో శ్రీను ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వచ్చేఏడాది ఫిబ్రవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు మనరాష్ట్రం నుంచి శ్రీనుతోపాటు కేజీబీవీ నుంచి ఎల్.దీప్తి, ఉల్లిభద్ర పాఠశాల నుంచి చాందిని, భాగ్యలక్ష్మి, హేమలత, చరణ్, మోహన్ కృష్ణ, శేఖర్ హాజరుకానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనును హెచ్‌ఎం డి.సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వర రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు చాణక్య

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం సమీపంలో శుక్రవారం సాయంత్రం జాతీయరహదారి దాటుతుండగా కారు ఢీకొనడంతో శ్రీకాకుళం పట్టణంలోని ఉర్లాం గ్రామానికి చెందిన ఆరంగి చాణక్య (29) మృతి చెందాడు. సీహెచ్ అగ్రహారం సమీపంలో చాణక్య జాతీయరహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పంచనామా అనంతరం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలజ్ఞాన స్ఫూర్తి ప్రదాత వీరబ్రహ్మేంద్రస్వామి


వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహావిష్కరణ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
• నగరంలో కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లో జగద్గురు విగ్రహావిష్కరణ

విజయనగరం: కాలజ్ఞాన స్ఫూర్తి ప్రదాత జగద్గురు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కాంస్య విగ్రహాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. విజయనగరం మున్సిపల్ కార్యాలయం జంక్షన్‌లో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఇరువురు ప్రజాప్రతినిధులు ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వీరబ్రహ్మేంద్రస్వామి భక్తులు పాల్గొన్నారు. అనంతరం 4వ డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు మార్గనిర్దేశం చేస్తూ కాలజ్ఞానాన్ని రచించి మానవాళికి అందించిన గొప్ప శక్తివంతుడు వీరబ్రహ్మేంద్రస్వామి పేర్కొన్నారు. విగ్రహ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. నగరంలో అనేక ప్రాంతాలలో వివిధ వర్గాల కోరిక మేరకు విగ్రహాలను, వివిధ ఆకృతులను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కాలజ్ఞానాన్ని రచించి రాబోయే కాలంలో సమాజంలో జరిగే మంచి చెడులను విశదపరిచారన్నారు. ఆయన చెప్పిన విధంగానే ప్రస్తుతం అన్ని జరుగుతున్నాయని అది ఆయన ఆలోచన పటిమకు దేవుడిచ్చిన వరం లాంటిదని అన్నారు. అనంతరం పీఠాధిపతి వీరధర్మజ స్వామిని ఘనంగా సత్కరించారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానాప్రసాద్, కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోనూరు విద్యార్థుల సత్తా

• రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు కైవసం


రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో సత్తాచాటి పతకాలు సాధించారు. ఈనెల 4,5,6 తేదీల్లో కర్నూలు జిల్లాలో అండర్-17 విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పి.తేజ ద్వితీయస్థానం సాధించి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. అలాగే ఈనెల 18,19,20 తేదీల్లో కడప జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో సీహెచ్.జశ్వంత్,ఎ.యమున తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న మరికొంత మంది విద్యార్థులను హెచ్‌ఎం.టీవీజీకే మూర్తి, పి.విజయలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

27న నైరెడ్‌లో స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూ

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 27న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ స్త్రీ, పురుషులు ఈ శిక్షణకు అర్హులన్నారు. పురుషులకు సీసీటీవీ రిపేరింగ్ అండ్ ఇన్‌స్టాలేషన్ (13 రోజులు), ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ అండ్ ఫ్యాన్ రివైండింగ్ (30 రోజులు), కార్ డ్రైవింగ్ (ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలి)లో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు లేడీస్ టైలరింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలీలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో రావాలని సూచించారు. శిక్షణ డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129, 9866913371, 9989953145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు

• నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: మహిళలపై జరిగే దాడుల్లో నిందితులు కఠినమైన శిక్షలకు గురి కావాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడుల్లో నమోదైన కేసుల్లో దర్యాప్తును క్షుణ్ణంగా చేయాలని, సాక్షులను, సాంకేతిక ఆధారాలను సేకరించాలని, దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను ఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేసేందుకు సంబంధిత దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, ఏఆర్ డీఎస్పీ యానివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా ఓటరు జాబితా సవరణ

• రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా


పార్వతీపురం: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం-8 తీసుకుని పరిష్కరించడం, చనిపోయిన, శాశ్వతంగా వలస పోయిన వారి పేర్లను ఓటరు జాబితానుంచి తొలగించడం, పత్రికలలో వచ్చిన వార్తలకు స్పందనగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారినందరినీ ఓటర్లుగా చేర్పించడాన్ని వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులపై త్వరగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు తదితరులున్నారు.

చేర్పులు, మార్పుల వినతులు 32,328

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా ఓటర్ల చేర్పులు, మార్పుల కోసం గత నెల 27 నుంచి నేటి వరకు ప్రజల నుంచి 32,528 దరఖాస్తులు స్వీకరించామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి వెల్లడించారు. ఇందులో భాగంగా ఈ-జాబితాలో 18,170 పేర్లు చేర్చినట్లు తెలిపారు. మరో 13,873 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు


మృతిచెందిన గౌతమ్

సాలూరు: పట్టణంలోని తోటవీధి సమీపంలో నివసిస్తున్న ఓ యువకుడి మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోటవీధి సమీపంలో నివాసముంటున్న మండల వెంకటలక్ష్మి కుమారుడు గౌతమ్(18) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సు చదువుతున్నాడు. సరిగ్గా చదువుకోవాలని తల్లి మందలించగా ,మనస్తాపానికి గురైన గౌతమ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.